

ఉత్తరం చేతిలో పట్టుకుని లోపలికి పరుగెట్టింది శశి. మూడునెలల క్రితం ముచ్చటగా పడిన మూడు ముళ్ళు ఆమెలో కొత్తపుల కింతలు రేపుతున్నాయి. ఉండుండి మంగళ సూత్రాలు ఊరికే గిలిగింతలు పెడుతున్నాయి. అలవాటుగా పరుగు పెడితే కాలిమట్టెలు, పట్టాల మువ్వలూ మురిపెంగా మోగుతున్నాయి. బంగారుగాజులమధ్య ధగధగమెరిసే మట్టిగాజులు మౌన సంగీతాలు మదిలో వినిపిస్తున్నాయి.

"అమ్మాయ్! ఉత్తరం ఎక్కడ్నించి?" వంటింట్లోంచి కాంతమ్మ మూడో సారి కేకవేసింది. శశి అప్పటికే వుత్తరం తెరిచి రెండుసార్లు చదవడం పూర్తి చేసింది. మంత్రముగ్ధలా అదేమళ్ళీ మొదలుపెట్టబోతూండగా— తల్లికేక వినిపించింది.

"ఆ... వస్తున్నాను" అంది.

"రానక్కర లేదు. ఉత్తరం ఎక్కడి నుంచి అంటే మాట్లాడవేమే మా తల్లీ" అంది.

'ఆయన రాశారమ్మా'అంది నెమ్మదిగా ఆ మాటతో తల్లిమరింక మాట్లాడదని ఆశతో—

"ఏమంటాడు" అంటూ దీర్ఘం తీసింది కాంతమ్మ..

"ఏమీలేదు. అంతా బాగున్నార్ట" అంది ముక్తసరిగా. కాంతమ్మ ఆశ్చర్యంగా కూతురి ముఖంలోకి చూసి, "అదేమిటే? అంతపెద్ద కాగితంలోనూ ఆ రెండు ముక్కలేనా"అని— "సర్లే పిచ్చిముఖమా! ఏదో రాసివుంటాడు అల్లుడు" అంటూ పనిలో పడిపోయింది. తల్లి అక్కడితో వదిలినందుకు తేలికగా నిట్టూర్చింది. శశి మళ్ళీ ఉత్తరం చదవటం మొదలుపెట్టింది. చివర రాసిన మాటలు ఆమెను మరీగిలిగింతలు పెడుతున్నాయి.

శశీ డియర్! మామిడి పండు రంగుమీద నల్లజరీ అంచు పట్టుచీరనీకెంతో బాగుంటుందని ఊహించుకుంటూ నేనే స్వయంగా వెళ్ళి కంచి షోరూంలో కొన్నాను. నువ్వాచీరలో ఎంతమెరిసి పోతావో చూడాలని తహతహలాడి పోతున్నాను. నేను శుక్రవారం వస్తున్నాను. మళ్ళీ శనివారం ఆఫీసు టైముకి యిక్కడికి వచ్చేస్తాను. ఆచీర కట్టుకుని నువ్వుపూజ పేరంటం చేసుకుని నాదగ్గర కొచ్చి, మెత్తని ఆ పట్టు చీరలో..

.............................

శశి చటుక్కున వుత్తరం మూసేసింది. ఆమె బుగ్గలు కెంపులయ్యాయి. సిగ్గుతో వొళ్ళంతా పులకించి పోయింది. తనకి అత్తవారు పంపిన శ్రావణ పట్టే పట్టు చీర మడతలో ఉత్తరం భద్రంగా దాచుకుంది.

* * * *



## పరిచయం

చాలా కథలు, కొన్ని కవితలు, ఓ ఎనిమిది నవలలు రాశాను. రెండు కథల సంపుటాలు, ఏడు నవలలు పుస్తకాల రూపంలో వచ్చాయి.

సాహిత్యం, సంగీతం నాకు హాబీలుకావు. ఆరాధ్యాలు. ఆకాశవాణి లలితసంగీతం ఆర్టిస్టుని. నేను పాడగా ఈమధ్యే రికార్డయిన ఒక లలిత సంగీతం క్యాసెట్ త్వరలో విడుదల కాబోతోంది.

ఆథర్సు గిల్డు ఆఫ్ ఇండియా (*Authors Guild of India*) మెంబర్ని. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థలో—గుంటూరు—I డిపోలో అకౌంటెంట్‌గా వుద్యోగం...

ఇకపోతే—,

పట్టుచీర:—చిన్నకథ రాయటానికి ప్రేరణ అంటారా,—


వయసు మళ్ళిన అత్తగార్లు, అమ్మలు, పినతల్లులు మేనత్తలూ వుండే ప్రతి మధ్య తరగతి ఇంట్లోనూ కొత్తపెళ్ళి కూతుళ్ళు విడదీయలేని మధురోహలమాలికల చిక్కులే ఇవి—,

—రచయిత్రి

# పట్టుచీర

## ఇంద్రగంటి జానకీబాల





''పశువు కాదు, పాముకాదు, పడతి కాదు—ఐనా పాలిస్తుంది? ఎవరు?

''పక్షి''

''నీ తలకాయ—ఆలోచించు''

మిల్క్‌వ్యాను



కరక్ట్! మరో ప్రశ్న, బట్టతల కాదు—టోపీ లేదు—అయినా వర్షంలో వెళ్తుంటే తల తడవదు—ఎలా?



గొడుగు ఉంది

శభాష్ బిడ్డా!

—మెజీషియన్ బి.వి.పట్టాభిరావ్

ఆఖరి పేరంటం పూర్తి చేసుకుని శశి వేగంగా నడూస్తోంది. ఎన్నాళ్ళకో మాసిన లక్ష్మి మధ్యలో కనిపించి పదినిముషాలు ఆపేసింది. అయినా హడావిడిగా వదిలించుకుని వచ్చేసింది. మనసునిండా అలజడి. ఈయన వచ్చేశారేమో! వచ్చేస్తే తనింకా రాలేదని చిటపట లాడుతున్నారేమో! అమ్మకాఫీ అయినా ఇచ్చిందో లేదో — అమ్మకాఫీలో పంచదార ఎక్కువ వేస్తుంది. ఆయనకి కాఫీలో పంచదార ఎక్కువ పడకూడదు. చేదుగా వుండాలి—

శశి అనేక రకమైన ఆలోచనలతో సతమతమవుతూ చకచకా నడుస్తోంది. సన్నగా జల్లు ప్రారంభమైంది. ఆరుగంటలయిందో లేదో చీకట్లు ముసురుకున్నాయి. ఎలాగైతేనే పరుగులాంటి నడకతో యింట్లో కొచ్చిపడింది శశి.

భర్తవచ్చాశాడేమోనని చూసింది. వచ్చిన జాడేం లేదు. తల్లి నడుగుదామనుకుంది. వెంటనే సిగ్గు వచ్చి ఆగిపోయింది. అంతలోనే వచ్చి తను లేదని మళ్ళీ బయటకెళ్ళి పోలేదుకదా అని భయపడిపోయింది—

ముఖం చూసుకుంది అద్దంలో—

మెడ నిండాగంధం— అందరూ పెట్టిన బొట్టు ఎదిగి ఎదిగి పావలాకాసంతయింది. జడలో చేమంతులు మల్లెలు చెంపల మీంచి తొంగిచూస్తున్నాయి.

పాత సినిమా పాటగుర్తుకొచ్చింది.

పడమట సంధ్యారాగం

కుడి ఎడమల కుసుమపరాగం— అంటూ కూని రాగం తీసుకుంటూ కాళ్ళుకడుక్కోటానికెళ్ళింది.

''అమ్మాయి శశీ— ఆ పట్టుచీర మార్చుకుని ముందు గదికాస్త సర్దు. మరీ గందరగోళంగా వుంది. అతనొస్తాడు'' అంది వంటింట్లోంచి. సెనగలు సొతాళిస్తున్న గుబాళింపు గుప్పుమంది.

శశి చీర మార్చకుండా ఇల్లు శుభ్రంగా సర్దేసింది. చీపురుతో ఊడ్చి పోగు తలుపుచాటుకి తోసింది. ఇంతలో కాంతమ్మ ''చీర మార్చుకోవే! పాడయి పోతుంది'' అంటూ దీర్ఘం తీసింది.

''మార్చుకుంటాలే'' అంటూ తమా సాగదీసి తలలో పూలుసర్దుకోవడం —బొట్టు చిన్నదిగా సరి దిద్దుకోవడం చేస్తోంది.

మదిలో—వెలి మోహనరాగం ఊ...ఊ...
జీవితమే మధురానురాగం

వానజల్లు కాస్తపెరిగింది. శశిగుండె దడదడ లాడింది. మధ్యలో తడిసిపోతారేమో —, తలతడిస్తే మంచిది కూడాకాదు.—, అసంకల్పితంగా వీధి వాకిట్లోకి వెళ్ళి చూసింది. రివ్వున గాలి ముంగురుల్ని రేపింది. సన్నటి జల్లు జాకెట్టును తడిపింది.

మళ్ళీ ఇంట్లోకి వచ్చింది.

''ఇదిగో చెప్పిన మాట వినవుకదా! వానలోకూడా తడిపేసుకుంటావెందుకు? ఖరీదైన చీర—, విప్పేసి వాయిల్ చీర కట్టుకుని, సొపుగా మడతెట్టుకునీ ...'' తల్లిమాటల్ని తుంచేస్తూ...

''అబ్బవుండవే! చంపుకుతింటున్నావు. మార్చుకుంటాను లేవే'' అని విసుక్కుని, అక్కడే వున్నవారపత్రిక అందుకుని తిరగేయడం మొదలెట్టింది.

ఆమె బుర్ర చురుకుగా ఆలోచిస్తోంది. ఈమహానుభావులు మరో అరగంట ఆలస్యం చేస్తే, అమ్మనన్ను సాధించిసాధించి పట్టుచీరమార్పించిగానీ వూరుకోదు. తీరా ఆయన వచ్చేసరికి తనాచీరలో వుండకపోతే కోపమొస్తుందేమో కాకపోయినా నిరుత్సాహపడినా తను సహించగలదా! అయినా అమ్మకి బొత్తిగా ఏమీతెలీదు.

''ఏమేమళ్ళీ పుస్తకం పట్టావు? చీర మార్చుకోవే అంటే వినవుకదా! నలిగి పోతుందని కదా చెప్తున్నాను. పొద్దున్న పక్కింటి కామేశ్వరికి చూపించాను. ఆ చీర ఎనిమిది వందలకి తక్కువ వుండదని చెప్పింది. తెలుసా!'' అంది బుద్ధి చెప్తున్న ధోరణిలో.

''అనడమే కనిపిస్తోంది. నీ చెవిలో పడటమేలేదు'' అంది

''మారుస్తాగా ''అంది.

''అవునూ! చెప్పిన మాట వెంటనే వినవు. ముచ్చూడు రూపులా ఆ తండ్రిపోలికే. నోట్లోంచే ఊడి పడ్డావు మా తల్లీ'' అంది.

శశి వెయ్యిదేవుళ్ళకి మొక్కు కోవడం మొదలు పెట్టింది. అవునూ! ఇంతమొండి తనమైతే రేపు అత్తారింట్లో...''

బయట గేటు చప్పుడైంది. కాంతమ్మ మాటలు ఆపేసింది. శశి ఆశగా వీధి వైపు చూసింది. అవును. అతనే—ఒక్క పరుగు తీసింది. అతను వస్తూనే పక్క గదిలోకి వెళ్ళిపోయాడు. మంచి నీళ్ళగ్లాసు తీసుకుని అతను వెనకాలే వెళ్ళి నీళ్ళగ్లాసు కిటికీలో పెట్టి అతన్ని చూసింది. అతను ఆశ్చర్యంగా భార్యని చూసి, మురిపెంగా ముద్దుపెట్టుకుని గట్టిగా కౌగలించుకున్నాడు.

''శశీ! ఈచీరలో నువ్వెంత బాగున్నావో తెలుసా'' అంటూన్న అతని మాటలు పరవశంగా వింది, ఆమె ఆ మాటలకోసం ఎంతసేపుగానో ఎదురుచూస్తోంది. ఆ మాటలు తియ్యగా గుండెల్నితాకుతున్న వేళ—

''అమ్మాయీ శశీ! చీర మార్చుకుని కంచాలు మంచి నీళ్ళుపెట్టు—అన్నాలు వడ్డిస్తాను '' అంటూ సూదైన బాణాల్లా తల్లి మాటలు దూసుకొచ్చాయి.

శశి ఏదో సమాధాన మివ్వబోయింది. అతనామెకా అవకాశం ఇవ్వలేదు.

అమ్మకి నిజంగా బుద్ధిలేదు అనుకుంది శశి మనసులో.


రచయిత్రి చిరునామా
ఇంద్రగంటి జానకీ బాల
59–A–6/1–11, ఆర్.టి.సి.కాలనీ
విజయవాడ—520008


### 'తర్వాత చెబుతా'

ఒకడు:— ఒరేయ్ 'తర్వాత చెబుతా' 'తర్వాత చెబుతా' అంటూ ప్రాణంతీస్తున్నావుకదా— 'ఫరెగ్జాంపుల్' మీ ఇంట్లో దొంగలుపడ్డారనుకో ఆ తర్వాత కూడా ఏమన్నా చెబుతావా?

రెండవవాడు:— ఆ—తర్వాత వాళ్ళకు మీ ఇంటి అడ్రస్ చెబుతా—ఎందుకో చెప్పను